# బెస్ట్ సర్వీస్

- కల్లూరు రాఘవేంద్రరావు

"నా గుర్రానికి ఖాయలాగా వుంది సార్!"

చేతులు నలుపుకొంటూ బొంగురుపోయిన గొంతుతో అన్నాడు ఖాశీం.

"పశువుల ఆస్పత్రికి తీసుకెళ్లకపోయావా!" అన్నాడు బ్యాంక్ మేనేజర్ నిర్లక్ష్యంగా ఫైళ్లు చూసుకొంటూ.

"అది- ఇంక బతకదు సార్!"

ఆత్మీయుణ్ణి కోల్పోతున్న వాడిలా బాధపడ్డాడు ఖాశీం. వాని కళ్లల్లో దీనత్వం గూడుకట్టుకొంది.

"అయితే, నన్నేం చేయమంటావ్?" అన్నాడు మేనేజర్ గట్టిగా గద్దిస్తూ.

"కొత్త గుర్రం కొనాల సార్! లేకుంటే నా జీవనానికి కష్టమౌతుంది" అంటూ కంటతడి పెట్టాడు ఖాశీం.

మేనేజర్ ఫైళ్లలో నుండి ఒక్కసారి తలెత్తి చూశాడు. అతని ఏడ్పు అతనికి నవ్వు తెచ్చింది. నవ్వుతూ,

"కొనేసెయ్" అన్నాడు.

"ఓ ఐదువేలు లోను కావాలి సార్! మీ బాకీ దినందినం కట్టేస్తాన్ సార్!" అంటూ ప్రాధేయపడ్డాడు ఖాశీం.

ఖాశీంకున్న ఆస్తంతా ఆ జట్కా, ఆ గుర్రం మాత్రమే.

''గుర్రాలకు, గాడిదలకు లోనివ్వడానికే బ్యాంకులున్నాయనుకొన్నావా?" అన్నాడు మేనేజర్ కోపంగా.

"ఆవులకు, ఎద్దులకు, ఎనుములకు, గొర్రెలకు ఇస్తారు కదా సార్! నాకీ బ్యాంకులో నెలనెలా కట్టే అకౌంటు కూడా వుంది సార్! నా కొడుకు రిక్షా తొక్కుతాడు. నేను దినానికి నూరు రూపాయలు సంపాదిస్తాను సార్! భయంతో కట్టుకొంటాను. జామీన్ కూడా ఇప్పిస్తాను సార్!" అంటూ తానివ్వగలిగినంత హామీ కూడా బ్యాంకుకు ఇచ్చాడు ఖాశీం. కానీ మేనేజర్ గారికి ఆ పూచీలన్నీ ఒక లెక్కలో లేనివి.

"చాలు పోవయ్యా! అనవసరంగా విసిగించకు. వెళ్లు... వెళ్లూ. లోన్ తీసుకొనేవరకే, ఆ తరువాత బ్యాంకు ముఖం కూడా చూడరు. ఇప్పటికే మీలాంటి వాళ్లకంతా అప్పులిచ్చి బ్యాంకులు బోర్డులు తిప్పేశాయి. ఇప్పుడు వీలుపడదు. పైనుండి మాకు ఎలాంటి అప్పులు ఇవ్వవద్దని ఉత్తర్వులొచ్చాయి. ఇవ్వడానికి వీల్లేదు. వెళ్లు..." అన్నాడు మేనేజర్ నిర్దయగా.

అంతవరకు ఖాశీం కళ్లల్లో వెలుగుతున్న ఆశాజ్యోతి క్రమేపీ కొడిగట్టింది. దీనంగా తలొంచుకుని బయటికి నడుస్తున్న ఖాశీంకు ఓ నల్గురైదుగురు పెద్దమనుషులు లోనికి రావడం కనిపించింది. అందులో ఓ ఇద్దరు అతనికి బాగా పరిచయమున్నవారే. నవ్వుతూ సలాం చేశాడు ఖాశీం. అయినా వాళ్లు గుర్తించనట్లుగానే లోనికెళ్లారు.

✦✦✦

"మీరు మా క్లబ్‌లో మెంబరుగా జాయిన్ కావాలి సార్! మీ గురించి, మీ పబ్లిక్ సర్వీసు గురించి మా మిత్రుడు చెప్పాడు" అంటూ తామొచ్చిన పనిని వివరించారు ఆ క్లబ్ సభ్యులు.

"థాంక్యూ! ఐ విల్ డూ మై బెస్ట్ సర్వీస్..." అంటూ వారితో కరచాలనం చేశాడు మేనేజర్. అందరూ వెళ్లిపోయారు.

ఓ రోజు క్లబ్‌కొచ్చిన బ్యాంకు మేనేజర్‌కు క్లబ్ సెక్రటరీ తాము క్రితంలో నిర్వహించిన సేవా కార్యక్రమాల ఫొటో ఆల్బమ్ అందిస్తూ ఒక్కొక్క కార్యక్రమాన్నే వివరించడం మొదలుపెట్టాడు.

ఆల్బమ్‌లోని ఒక ఫొటోవైపే చాలాసేపు నిశితంగా చూస్తూ, "ఈ ఫొటో...?" అంటూ ఆశ్చర్యంగా ప్రశ్నించాడు మేనేజర్.

"ఈమధ్యనే జరిగిన ఫ్రీ ఐ క్యాంపులో తీసింది సార్, యిది. మూడు లక్షలదాకా ఖర్చుపెట్టి వందలకొద్దీ జనానికి క్యాంపు నిర్వహించాం. అప్పుడు వీడు వాలంటీరుగా పనిచేశాడు. తన జట్కాలో పేషెంట్లను ఉచితంగా క్యాంపుకు చేర్చడం, వారికి అన్ని పనుల్లోనూ సహాయపడడం చూసిన జిల్లా కలెక్టర్ వాణ్ణి గుర్తించి సన్మానించాడు. వాడి కడుపు కొట్టడమెందుకని, కొంత డబ్బు వానికి పే చేయబోయాం. కానీ వాడేదో ఇంకా కొంత మా నుండి ఆశించినట్టుంది, అందుకే వాడు వద్దన్నాడు. పూర్ ఫెలో..." అన్నాడు సెక్రటరీ నిర్లక్ష్యంగా.

ఆ మాటతో మేనేజర్ కళ్లు తిరిగిపోయాయి.

ఖాశీం ఫొటోవంకే తదేకంగా చూశాడు.

కల్మషం లేని ఆ కన్నులు జ్యోతుల్లా వెలుగుతున్నాయి.

జరిగిన ఆ చిరు సన్మానానికే ఆ ముఖంలో ఆనందం తాండవిస్తోంది.

ఆ పెదవులపై చిరునవ్వులు చిందుతున్నాయి.

మేనేజర్ మనసు కకావికలమైంది.

"ఓకే... థ్యాంక్స్! ఇక సెలవు. వీలున్నప్పుడు కలుస్తాను"

అంటూ ఆల్బం టేబుల్‌పై గిరాటేసి లేచాడు మేనేజర్.

"ఓకే సార్, మీకో రిక్వెస్టు. నేనో మిల్క్ డైరి పెట్టాలనుకుంటున్నాను. మీ బ్యాంకు పాడిపశువులకు లోన్లు ఇస్తుందని తెలిసింది. మీరు రికమెండ్ చేసి నాకో రెండు లక్షల లోన్ శాంక్షన్ చేయించాలి సార్!" అంటూ నాలుగు ఇంగ్లీషు ముక్కల్లో సంక్షిప్తంగా మనసులోని కోరికను వెల్లడించాడు క్లబ్ సెక్రటరీ, నసుగుతూ..

బ్యాంకు మేనేజర్ అతని మాటల్ని చెవులో వేసుకోకుండా వేగంగా మెట్లు దిగి, స్కూటర్లో నడిరోడ్డు పైకి వచ్చేశాడు. కొంత దూరం పోగానే రోడ్డుపైన ఓ పెద్ద గుంపు కనిపించింది. ఎంతగా హారన్ ఇచ్చినా గుంపు చెదరడం లేదు. వాహనాలన్నీ నిలిచిపోయాయి. మేనేజర్ స్కూటర్ దిగి "ఏమిటా?" అని అటుగా తొంగిచూశాడు.

బండికి కట్టిన గుర్రం, ఉన్నదున్నట్లుగా నేలకొరిగి, గిలగిలా తన్నుకుంటోంది. జట్కావాలా భోరున ఏడుస్తున్నాడు. ఎందరు సహాయపడుతున్నా ఆ గుర్రం లేవడం లేదు.

"ఒరే ఖాశీం ఇది చచ్చిపోయిందిరా!" అని ఎవరో గట్టిగా అన్న మాటలు మేనేజర్ మనసును చాలా బాధపెట్టాయి. ఒక్కసారి అటుగా చూశాడు. ఆ బాధితుడు ఎవరో కాదు, ఖాశీం. ఖాశీం ఒక నిస్వార్థ సేవాపరాయణుడుగా కలెక్టరుతో సన్మానం పొందినవాడు.

"ఇక, ఖాశీం బ్రతుకు కూడా కుప్పకూలాల్సిందేనా!" మేనేజర్ అనుకొన్నాడు మనసులో.

"నో... ఐ విల్ డూ మై బెస్ట్ సర్వీస్ టు ద పూర్ అండ్ నీడీ" అంటూ మనసులో అతని వాక్కు పలుసార్లు ప్రతిధ్వనించింది. ఆ దుఃఖంలో ఖాశీం అల్లాకు మాత్రమే మొరపెట్టుకున్నాడు.

✦

## సెలవు గూళ్లు

సెలవుల్లో మునిగిన బడులు మునులౌతాయి
అలసిన అక్షరాలు దసరాకనో సంక్రాంతికనో
పనికి విశ్రాంతి కోరుతాయి
తెగబడ్డ గొర్రె తలల్లా
ఆ రెండు గేటు మోతల చప్పుడు మూగపోతుంది.
రోజూ పడగ విప్పే బెత్తాలు
పని భారానికో పండుగ సంతోషానికో
చిట్టి ఆటల్లో పందిరి ఊసలౌతాయి.
జ్ఞాన సముద్రాల్ని ఈదలేని గజ ఈతగాళ్లలా
గురువులంతా సేదకై ఇంటిబుడ్డిలో వొదిగిపోతారు.
తిరిగి బడి మొదలయ్యాక
భారంగా కాళ్లు యంత్రాలౌతాయి.
రెక్కలు ముడుచుకున్న పుస్తకాలు సంచుల్లో లేచొస్తాయి.
ఈ జీవన కొయ్యకి బడి గంటొకటి
తిరిగి పల్లికిలిస్తూ మొదట గంట కొడుతుంది.
పండుగ గంపలో సెలవల్ని తిన్న కాలం
పిల్లల ముందు ప్రార్థనా గీతమౌతుంది.
తొలి పిరియడ్ బరువుతో బడి గదులు
కుశలాల్ని కదుపుతుంటాయి.
అరువెక్కిన పాఠాల్తో
పిల్లలు తిరిగి బట్టీ బట్టీయంలో కెళతారు.
విశ్రాంతి గంటతో పిల్లలంతా పని
పురుగులౌతారు.
తిరిగి జీవితం ప్యూపాని వొదిలి
అక్షర సీతాకోక చిలుకలౌతారు.

-మల్లంపల్లి విజయకుమార్